ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

బాన్సువాడ/ బీర్కూర్, నవంబర్ 3: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బాన్సువాడ సొసైటీ పరిధిలోని బాన్సువాడ, బీర్కూర్ రోడ్డులో, బీర్కూర్ ప్రాథమిక సహకార సంఘం పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో ధాన్యం కాంటాలను ఆయన రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధరతోపాటు బోనస్ పొందాలని సూచించారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. కేవలం బాన్సువాడ నియోజకవర్గంలోని రైస్‌మిల్లర్లు మాత్రమే ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్, వైస్ చైర్పర్సన్లు కృష్ణారెడ్డి, మంజులా జనార్దన్ రెడ్డి, కార్యదర్శి నారాయణరెడ్డి, నాయకులు మోహన్‌నాయక్, నార్ల ఉదయ్ గుప్తా, డైరెక్టర్ సాయిలు, మోహన్‌రెడ్డి, బీరప్ప, రాజిరెడ్డి, అశోక్ రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకట్రామ్ రెడ్డి, గంగారెడ్డి, సంజీవరెడ్డి, దుర్గారెడ్డి, సాయిలు, హన్మాండ్లు, పర్వయ్య, మహ్మద్, లక్ష్మణ్, ప్రమోద్‌రెడ్డి, బీర్కూర్ విండో చైర్మన్ కొల్లి గాంధీ, నాయకులు ఆవారి గంగారాం, శశికాంత్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో చేపల విక్రయ మార్కెట్ నిర్మాణం

తాడ్వాయి చెరువులో చేపలను వదులుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

లింగంపేట, నవంబర్ 3: తాడ్వాయిలో చేపల విక్రయ మార్కెట్ నిర్మాణాన్ని చేపడుతామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తెలిపారు. తాడ్వాయిలోని శబరీమాత చెరువులో ఆదివారం చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఉన్న 217 చెరువుల్లో 29.15లక్షల రూపాయల విలువ చేసే చేప పిల్లలను విడుదల చేయనున్నట్లు తెలిపారు. మత్స్య కార్మికులకు రూ.ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పిస్తామని, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో మత్స్యశాఖ కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు శ్యాంరావు, మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ, రాంచంద్రం, రాజు, సంజీవులు, నరేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌చారి, బలరాం, శివాజీరావు, శ్రీకాంత్, రంజిత్‌రెడ్డితోపాటు మత్స్యకారులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ..

లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల మత్స్యకారులకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. తాడ్వాయి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా లింగంపేట మండల మత్స్యకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మత్స్యకారులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, మత్స్య శాఖ జిల్లా అధికారి శ్రీపతికి శాలువా కప్పి సన్మానించారు.

వాహనాల తనిఖీ

వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

బీబీపేట్, నవంబర్ 3: బీబీపేట్‌లోని శ్రీగాధ రోడ్డులో స్థానిక ఎస్సై ప్రభాకర్ ఆదేశాల మేరకు ఏఎస్సై మధుసూదన్‌రావు, పోలీస్ సిబ్బంది ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సరైన ధ్రువ పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని సూచించారు కార్యక్రమంలో సిబ్బంది రవీందర్, శ్రీకాంత్ తదతరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

మాచారెడ్డి, నవంబర్ 3: మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన పాల్వంచ మండలంలోని పోతారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోతుల లక్ష్మి(29) శనివారం సాయంత్రం ఫోన్‌లో మాట్లాడుతున్నది. అదే సమయంలో భర్త సత్యం ఎవరితో మాట్లాడుతున్నావని ప్రశ్నించాడు. ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మి ఆదివారం ఉదయం చెరువు వద్దకు వెళ్లి అందులో దూకి ఆత్మహత్య చేసుకున్నది. ఆమెకు కొడుకు, కూతురు ఉన్నారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించామని చెప్పారు.

చుక్కాపూర్‌లో భక్తుల సందడి

మాచారెడ్డి, నవంబర్ 3: మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలలతోపాటు ఇతర జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ఒడిబియ్యం, పట్టె నామాలు, కోరమీసాలు, కండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ సమీపంలోని బావి నీటితో పుణ్య స్నానాలు ఆచరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

కామారెడ్డికి తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

కామారెడ్డికి తరలివెళ్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నాగిరెడ్డిపేట, నవంబర్ 3: జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదివారం తలపెట్టిన ధర్మయుద్ధ మహాసభకు మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు కుంటోళ్ల యాదగిరి, తొంట సాయిలు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు తమ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా ఫ్లెక్సీ దహనం

లింగంపేట, నవంబర్ 3: లింగంపేటలోని జంబి హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన హనుమాన్ చాలీసా ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. విషయాన్ని ఆదివారం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. ప్రమాదవశాత్తు జరిగిందా? కావాలని ఎవరైనా దహనం చేశారా? అనే కోణంలో విచారణ ప్రారంభించారు. గతంలోనూ ఈ ఆయలంలో ఉన్న హనుమాన్ విగ్రహాన్ని గొడ్డలితో ధ్వంసం చేశారు. ఈ విషయమై ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌ను వివరణ కోరగా.. విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. తమకు ఫిర్యాదు రాలేదన్నారు.

బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

బీర్కూర్‌లో పోలీసుల బందోబస్తు

బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

నస్రుల్లాబాద్, నవంబర్ 3: చంపుతా అని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బీర్కూర్‌కు చెందిన సల్లూ అదే గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు వడ్ల బస్వరాజ్‌ను చంపుతానని ఫోన్‌లో బెదిరించాడు. దీంతోపాటు బీజేపీని కించపరిచే విధంగా మాట్లాడుతూ.. పరుష పదజాలంతో దూషించాడు. ఈ మేరకు బస్వారాజ్ అతడితో తనకు ప్రాణహాని ఉన్నదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సల్లూపై కేసు నమోదు చేసి, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ఎల్లారెడ్డిలో 'భగినీ హస్త భోజనం'

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 3: దీపావళి పండుగలో భాగంగా ఎల్లారెడ్డిలో ఆదివారం 'భగినీ హస్త భోజనం' నిర్వహించారు. భాయ్ దూజ్ పేరు తో జరుపుకునే ఈ పండుగ సందర్భంగా సోదరి మణి ఇం టికి సోదరుడు వెళ్లి భోజనం చేస్తే మధ్యంతర మృత్యుభ యం తొలిగిపోతుందని ప్రజ ల నమ్మకం. భగినీ అంటే సో దరి అని ఆమె చేతితో పెట్టే భో జనం కావడంతో భగినీ హస్త భోజనం అని పిలుస్తుంటారు. ఎల్లారెడ్డిలో పండుగను వైభవంగా జరుపుకొన్నారు.

ఎల్లారెడ్డిలో సోదరుడికి భగినీ హస్త భోజనం వడ్డిస్తున్న సోదలిమణులు

బారెడు పోచమ్మకు బోనాల సమర్పణ

నస్రుల్లాబాద్, నవంబర్ 3: నస్రుల్లాబాద్ గ్రామస్తులు బారెడు పోచమ్మ పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బాజాభజంత్రీలతో బోనాలను ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అమ్మ వారికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ కంది మల్లేశ్, గ్రామస్తులు లింగం, సాయాగౌడ్, నారాయణ, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

జ్యోతిబాపూలే పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

విద్యార్థినులతో వంట తయారు చేయించడంపై కాటిపల్లి ఆగ్రహం

కిచెన్‌ను పరిశీలిస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

భిక్కనూరు, నవంబర్ 3: మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఉన్న జ్యోతిబాపూలే పాఠశాలను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. హాస్టల్‌లోని కిచెన్ షెడ్డు పరిసరాలు పరిశీలించారు. విద్యార్థినులతో ఆహారాన్ని తయారు చేయించడాన్ని చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యార్థినులతో పనులు చేయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం బస్వాపూర్‌లో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు ఉప్పరి రమేశ్ తదితరులు ఉన్నారు.

వ్యవసాయాధికారులు అందుబాటులో ఉండాలి

రామారెడ్డి, నవంబర్ 3: సదాశివనగర్‌తోపాటు పద్మాజీవాడి, ధర్మరావుపేట్ గ్రామాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయాధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి తూకం వేసేలా చూడాలని సూచించారు. ఆయనతోపాటు సదాశివనగర్ ఏవో ప్రజాప్రతి ఉన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్

పర్మళ్లలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

రైతులు ఇబ్బంది పడొద్దు..

లింగంపేట, నవంబర్ 3: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సహకార సంఘం అధికారులకు తహసీల్దార్ నరేందర్‌గౌడ్ సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి, పర్మళ్ల, అయ్యపల్లి, లింగంపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని వరసక్రమంలో తూకం వేయాలని సూచించారు. తహసీల్దార్ వెంట ఆయా సహకార సంఘాల అధికారులు, కేంద్రాల ఇన్‌చార్జీలు ఉన్నారు.

పోటీలకు హాజరైన ఆర్చరీ క్రీడాకారులు

కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి పోటీలు

గాంధారి, నవంబర్ 3: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలు కొనసాగుతున్నాయి. పోటీల్లో భాగంగా రెండో రోజు ఆదివారం నిర్వాహకులు అండర్ -14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, ఫుట్‌బాల్, షూటింగ్ బాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, ఆర్చరీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి రాష్ట్రంలోని 23 ఈఎంఆర్ఎస్‌ల నుంచి వచ్చిన క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. పోటీలను తిలకించడానికి యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

చురుగ్గా రహదారి నిర్మాణం

నాగిరెడ్డిపేట, నవంబర్ 3: మండల కేంద్రం గోపాల్‌పేటతోపాటు పోచారం గ్రామంలో నూతన రహదారి నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. పోచారంలో రోడ్డుకు ఇరువైపులా అండర్‌డ్రైనేజ్ నిర్మాణం పూర్తిచేశారు. సర్వీస్‌రోడ్డు పనులు చేపడుతున్నారు. గోపాల్‌పేటలో రహదారికి ఇరువైపులా అండర్ డ్రైనేజీ నిర్మిస్తున్నారు. రోడ్డు పనులు చేపడుతుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

గోపాల్‌పేటలో రహదారి పక్కన నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ

లైబ్రేరియన్‌కు సన్మానం

బిచ్కుంద, నవంబర్ 3: బిచ్కుంద శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్‌గా పనిచేసే షేక్ నిస్సార్ అహ్మద్ పటేల్‌ను పలువురు పాఠకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. 40ఏండ్లుగా ఆయన ఎనలేని సేవలను అందించి ఉద్యోగ విరమణ చేస్తున్నాడని కొనియాడారు. శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మైపత్ హన్మాండ్లు, గాండ్ల మహేశ్, రచ్చ శివకాంత్, సాయిని బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

లైబ్రేరియన్‌ను సన్మానిస్తున్న పాఠకులు

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఆర్థిక సహాయం అందజేస్తున్న బస్వాపూర్ దళిత సంఘం బాధ్యులు

భిక్కనూరు, నవంబర్ 3: మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన కుమార్ అనారోగ్యంతో ఆదివారం మరణించాడు. దీంతో గ్రామ దళిత సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అంత్యక్రియల కోసం రూ.పది వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘం సభ్యులు రవికుమార్, భూషణం, సంజీవ్, నర్సింహులు, ఇజ్రాయెల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగితోపాటు కుటుంబసభ్యుల ఆరోగ్యమూ ముఖ్యమే..

నిజామాబాద్ ఆర్టీసీ పర్సనల్ మేనేజర్ పద్మజ

బాన్సువాడ టౌన్, నవంబర్ 3: ఉద్యోగితోపాటు అతడి కుటుంబ సభ్యుల ఆరోగ్యమూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు ముఖ్యమేనని నిజామాబాద్ ఆర్టీసీ పర్సనల్ మేనేజర్ పద్మజ అన్నారు. బాన్సువాడ ఆర్టీసీ డిపోలో జీవిత భాగస్వాముల గ్రాండ్ హెల్త్ చాలెంజ్‌ను ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. బీపీ, షుగర్, ఈసీజీ టెస్ట్‌లు చేయడంతోపాటు ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు అందజేశారు. కార్యక్రమంలో డిపో సిబ్బంది కిష్టయ్య, జానూబాయి, బసంత్, జగదీశ్వర్, హెల్త్ వాలంటీర్లు సంతోష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేయించుకుంటున్న ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబ సభ్యులు

పోస్టర్ల ఆవిష్కరణ

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ మాస్‌లైన్ నాయకులు

కామారెడ్డి, నవంబర్ 3: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న డీవీ కృష్ణ విగ్రహావిష్కరణ పోస్టర్లను కామారెడ్డిలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీసీఐ మాస్‌లైన్ జిల్లా నాయకుడు ప్రకాశ్ మాట్లాడుతూ.. సీపీఐ మాస్‌లైన్ ప్రజాపంథా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ విప్లవోద్యమ నిర్మాణం కోసం జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. సీపీఐ మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు రాంచందర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నారాయణ, రమేశ్, సురేశ్, ఎల్లన్న, కుమార్‌తోపాటు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

పీఈటీకి సన్మానం

మహేశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న మాందాపూర్ స్టోర్ట్స్ కమిటీ ప్రతినిధులు

బీబీపేట్, నవంబర్ 3: మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన మహేశ్‌కుమార్(శివ) ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో పీఈటీ ఉద్యోగం సాధించాడు. దీంతో ఆదివారం అతడిని మాందాపూర్ స్టోర్ట్స్ కమిటీ ప్రతినిధులు శాలువా కప్పి సత్కరించారు.

గోపాల్‌పేటలో కోతుల బెడద

ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

నాగిరెడ్డిపేట, నవంబర్ 3: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద కోతుల బెడద నెలకొన్నది. వందల సంఖ్యలో కోతులు కార్యాలయాల ఎదుట, చుట్టు పక్కలా తిరుగుతూ అధికారులు, సిబ్బందితోపాటు కార్యాలయాలకు వచ్చే ప్రజల వెంట పడుతున్నాయి. దీంతో వారు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటీవల గోపాల్‌పేటలో నలుగురు వ్యక్తులపై కోతులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో వారు దవాఖానలో చేరి చికిత్స చేయించుకుంటున్నారు. అధికారులు స్పందించి కోతుల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పౌరాదేవి పీఠాధిపతిని కలిసిన గిరిజన నాయకులు

పౌరాదేవి పీఠాధిపతి బాబూసింగ్ మహరాజ్‌తో గాంధారి మండల గిరిజన నాయకులు

గాంధారి, నవంబర్ 3: మహారాష్ట్రలోని పౌరాదేవి పీఠాధిపతి (ఎమ్మెల్సీ) బాబూసింగ్ మహరాజ్‌ను గాంధారి మండలంలోని పలు తండాలకు చెందిన గిరిజన నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బాబూసింగ్ మహరాజ్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించింది. దీంతో ఆయనను కలిసిన గిరిజన నాయకులు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో గాంధారి మాజీ ఎంపీపీ రాధాబలరాం నాయక్, హేమ్లానాయక్ తండా మాజీ సర్పంచి రాధాచందర్‌తోపాటు వెంకటాపూర్, హేమ్లానాయక్ తండా, మొండిసడాక్, కొయ్యగుట్టతండాకు చెందిన వారు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో కాంటా ప్రారంభం

లింగంపేట, నవంబర్ 3: లింగంపేట సహకార సంఘం పరిధిలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా వేయడం ప్రారంభమైనట్లు సహకార సంఘం చైర్మన్ దేవేందర్‌రెడ్డి తెలిపారు. సహకార సంఘం పరిధిలోని ఆయా గ్రామాల్లో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రైస్‌మిల్లర్లతో చర్చలు నిర్వహించిన కలెక్టర్ ధాన్యం తూకం ఆరంభించాలని ఆదేశాల మేరకు ఆదివారం నుంచి తూకం ప్రారంభించినట్లు తెలిపారు. లింగంపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకాన్ని మానిటరింగ్ అధికారిణి రాధిక పర్యవేక్షించారు. సీఈవో పెంటయ్య, సెంటర్ ఇన్‌చార్జి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటలో ధాన్యం కాంటా వేస్తున్న హమాలీలు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు షురూ..

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 3: మండలంలోని సాతెల్లి, తిమ్మారెడ్డి, తిమ్మారెడ్డి తండాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్లు ఏగుల నర్సింహులు, పటేల్ సాయిలు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, నాయకులు మంచిర్యాల విద్యాసాగర్, సాయిబాబా, నునుగొండ శ్రీనివాస్. గంగారెడ్డి, ఎల్లారెడ్డి సొసైటీ సీఈవో విశ్వనాథం, వెల్లుట్ల సొసైటీ కార్యదర్శి రాంచందర్, రైతులు పాల్గొన్నారు.